సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం । 7 । నవంబర్ । 2023



డ్రోన్ వినియోగంతో ఎన్నో లాభాలు

డ్రోన్లను వినియోగించడం వలన రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయని రాయచోటి వ్యవసాయశాఖ ఏడీ శ్రీలత పేర్కొన్నారు. -IIలో



మేడపై నుంచి దూకిన విద్యార్థిని

ఆదపూరు అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్న రెడ్డమ్మ మేడపై నుంచి దూకడంతో గాయాలపాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.270	రూ.352
రెండోరకం	రూ.160	రూ.268



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 201 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	496	522
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 697.680 కిలోలు

న్యూస్‌రీల్

రెఫరెల్ కేసులపై దృష్టి పెట్టాలి
– కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : జిల్లాలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష రెఫరెల్ కేసులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వై...ఏపీ నీడ్స్ జగన్ అంశాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సు కలెక్టర్ గిరీషా పీఎస్, డీఆర్‌ఓ సత్యనారాయణ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్సు అనంతరం వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వచ్చిన రెఫరెల్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలను బాగా నిర్వహించారని, ఇకపై నిర్వహించనున్న శిబిరాలను కూడా సజావుగా నిర్వహించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో జీజీహెచ్, ఎంపానల్ అయిన ఆసుపత్రులకు రెఫరెల్స్ చేసిన కేసులను దగ్గరుండి ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించి, మందులను ఉచితంగా అందించడం, ప్రభుత్వ ఆరోగ్య ఆసరా అందించడం చేయాలన్నారు. రెఫరెల్స్ కేసులపై డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్‌ఎస్, జిల్లా ఆరోగ్య కో–ఆర్డినేటర్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో డీఎంహెచ్‌ఓ కె. కొండయ్య, డీసీహెచ్‌ఎస్ డేవిడ్ సుకుమార్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

18 నుంచి కబడ్డీ పోటీలు



మాట్లాడుతున్న రాష్ట్ర వ్యాయామ తనిఖీ అధికారి భానుమూర్తి రాజు

చిట్వేలి : రాష్ట్రస్థాయి అండర్–14 బాలబాలికల కబడ్డీ పోటీలను చిట్వేలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర వ్యాయామ తనిఖీ అధికారి భానుమూర్తి రాజు వెల్లడించారు. సోమవారం చిట్వేలిలో ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం రెడ్డి, ఎంఈఓ కోదండ నాయుడు అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలలోని వ్యాయామ ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 18,19,20వ తేదీల్లో జగనన్న రాష్ట్రస్థాయి పోటీలను ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి వసంత, నీరాంజన తదితరులు పాల్గొన్నారు.

నాగాభరణం బహూకరణ

తంబళ్లపల్లె : మల్లయ్యకొండపై వెలసిన శ్రీభమరాంబిక మల్లికార్జునస్వామికి దాతలు వెండి నాగాభరణం వితరణగా ఇచ్చారు. పుంగనూరు మండం చంద్రమాకులపల్లె పంచాయతీ ఎల్ఆర్ బైలుకు చెందిన మల్లికార్జుననాయడు, ఉమాదేవి దంపతులు సుమారు రూ.80వేల విలువ చేసే వెండి నాగాభరణంను ఈఓ రమణ,ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డిల సమక్షంలో అందజేశారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులకు సూచనలు చేస్తున్న డీఈఓ

రాయచోటిటౌన్ : పదవ తరగతి విద్యార్థులలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డీఈవో శ్రీరాం పురుషోత్తం ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలోని పదవ తరగతి క్లాస్‌లను తనిఖీ చేశారు. విద్యార్థులకు బోధిస్తున్న విధానంపై పరీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పదవ తరగతి అనేది వారి భవిష్యత్తుకు బంగారు బాట లాంటిదన్నారు. ఇలాంటి సమయంలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణ, పట్టుదలతో శ్రద్ధగా చదవాలని విద్యార్థులకు సూచించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు, హెచ్‌ఎం నిర్మల, ఇతరా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గడువులోపు సమస్యలు పరిష్కరించాలి

రాయచోటిటౌన్ : అర్జీదారులు ఇచ్చిన అర్జీపై సంబంధిత పోలీస్ అధికారులు ఇచ్చిన గడువులోపు పరిశీలించి పరిష్కారం చూపాలని సూచించారు. సోమవారం జిల్లా కార్యాలయంలో ఎస్పీ బి. కృష్ణారావు ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 55 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. అర్జీలు అందించేందుకు వచ్చిన అర్జీదారులతో ఆయన నేరుగా మాట్లాడి వారి నుంచి అర్జీని స్వీకరించారు.

సేవా సైన్యం

విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జాతీయ సమైక్యత అలవర్చేలా విద్యార్థిదశ నుంచే సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించేలా శిక్షణ ఇచ్చే సేవాసంస్థ 'భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్'.. గతేడాది యూనిట్ల ఏర్పాటులో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవడం విశేషం. జిల్లా వ్యాప్తంగా 211 యూనిట్ల నుంచి 5176 మంది కేడెట్స్ శిక్షణ పొందుతూ సమాజ సేవలందిస్తున్నారు. నవంబర్ 7న భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని కథనం.

- వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో 211 స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు
- 5176 మంది బాలబాలికలకు శిక్షణ
- నేడు 74వ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం



ఇన్‌చార్జి మంత్రి చేతుల మీదుగా ఉత్తమ సేవలకు పురస్కారం అందుకుంటున్న స్కౌట్స్ అండ్ గైడ్స్(ఫైల్)

కడప స్పోర్ట్స్ : స్కౌట్స్ అండ్ గైడ్స్ (బీజీఎస్) దేశంలో 1907లో మేజర్ బెడెన్ పావెల్ చేతుల మీదుగా ప్రారంభం కాగా, కడప జిల్లాలో 1930లో ప్రారంభమైంది. అనంతరం రెండుగా ఉన్న స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్లు 1950లో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌గా రూపాంతరం చెందింది. అప్పట్లో కడప నగరానికి చెందిన దాత రావుబహదూర్ వెంకటశేషం శెట్టి 2.25 ఎకరాల స్థలాన్ని స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ఉచితంగా అందజేశారు. దీంతో 1937లో అప్పటి కలెక్టర్ హెజ్‌మాడీ ప్రస్తుతం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉన్న భవనాన్ని నిర్మించాడు. జిల్లాలో గత కొద్ది సంవత్సరాలుగా శిక్షణ శిబిరాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి అనూహ్య స్పందన వస్తుండటంతో స్కౌట్స్ ప్రాధాన్యం పెరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలోనూ స్కౌట్ శిక్షణ కార్యక్రమాలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా 73 మంది స్కౌట్‌మాస్టర్‌లు, 29 మంది గైడ్‌లుగా వ్యవహరిస్తూ శిక్షణ అందిస్తున్నారు. 2022–23 విద్యాసంవత్సరంలో ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో 209 యూనిట్లు ఏర్పాటుచేసి రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా నిలవడం విశేషం.

శిక్షణ ఇలా..

స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ మొత్తం ఆరుదశల్లో ఉంటుంది. ఇందులో భాగంగా ప్రవేశ్, ప్రథమసోపాన్, ద్వితీయ సోపాన్, తృతీయ సోపాన్, రాజ్యపురస్కార్, రాష్ట్రపతి అవార్డు ఎంపిక వరకు విద్యార్థినీ విద్యార్థులు తమ ప్రతిభచాటుకునే అవకాశం ఉంటుంది. స్కౌట్‌లో శిక్షణ పొందడం ద్వారా శారీరకంగా విద్యార్థుల్లో ఉత్సాహం లభిస్తుంది. సమాజంపై అవగాహన ఏర్పడుతుంది. పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలు అలవడతాయి.8 అంశాల స్కౌట్స్ నియమాలు విద్యార్థులను పరిపూర్ణవంతులుగా మలిచేందుకు ఉపయోగపడుతుంది.

బీఎస్‌జీలో నేర్పే అంశాలు..

- నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం.
- జట్టుకృషిని,సహకారాన్ని ప్రోత్సహించడం.
- ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడం.
- శారీరక ధృడత్వం,బహిరంగ కార్యకలాపాలను ప్రోత్సహించడం.
- జీవననైపుణ్యాలను నేర్చుకోవడం.
- సమాజ సేవాభావాన్ని పెంపొందించడం.
- సాంస్కృతిక అవగాహనను అభివృద్ధి చేయడం.
- వ్యక్తిగత వృద్ధికి అవకాశాలను అందించడం.
- భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు విద్య, ఉద్యోగరంగాల్లో రిజర్వేషన్లు కల్పించాయి. కేంద్ర ప్రభుత్వం రైల్వే, పోస్టల్ విభాగాల్లో ప్రత్యేక ఖాళీలు కేటాయిస్తారు.
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని రకాల పోటీ పరీక్షల్లో 0.5 శాతం రిజర్వేషన్ కల్పిస్తోంది.

స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు, కేడెట్స్ వివరాలు..

యూనిట్లు	సంఖ్య	బాలబాలికలు
వైఎస్ఆర్ కడప జిల్లా		
కబ్ యూనిట్లు	02	24 మంది బాలురు
బుల్ బుల్ యూనిట్	01	12 మంది బాలికలు
స్కౌట్ యూనిట్స్	82	1963 మంది బాలురు
గైడ్ యూనిట్స్	53	1533 మంది బాలికలు
రోవర్ యూనిట్స్	12	216 మంది బాలురు
రేంజర్ యూనిట్స్	04	60 మంది బాలికలు
అన్నమయ్య జిల్లా		
స్కౌట్ యూనిట్స్	30	751 మంది బాలురు
గైడ్ యూనిట్స్	19	458 మంది బాలికలు
రోవర్ యూనిట్స్	05	90 మంది బాలురు
రేంజర్ యూనిట్స్	03	45 మంది బాలికలు

7 నుంచి 14 వరకు ప్రత్యేక కార్యక్రమాలు..

- నవంబర్ 7 నుంచి 14వ తేదీ వరకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 74వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలునిర్వహించనున్నారు.అవగాహన ర్యాలీలు, క్యాంప్‌ఫైర్, కార్యక్రమాలను రోజుకొకటి చొప్పున నిర్వహించేలా పాఠశాల విద్యా కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు.
- కడప నగరంలో ఉన్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యాలయం ఆంధ్రప్రదేశ్‌కు ప్రాంతీయ కార్యాలయంగా సేవలందిస్తోంది.
- అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె దక్షిణభారత దేశ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యకలాపాలకు ప్రాంతీయ కేంద్రంగా సేవలందిస్తోంది.

నేటి నుంచి వారోత్సవాలు



భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరే విద్యార్థులకు ప్రధానంగా 8 రకాల అంశాలపై శిక్షణ ఇస్తారు. విద్యార్థి అన్ని రంగాల్లో రాణించేలా ఆత్మస్థైర్యం పెంపొందేలా శిక్షణ ఉంటుంది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చురుగ్గా కార్యకలాపాలు నిర్వహిస్తూ రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలుస్తోంది. ఈనెల 7 నుంచి 14వ తేదీ వరకు వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను నిర్వహిస్తాం .ఇందులో భాగంగా ఫ్లాగ్ డే స్టిక్కర్స్ పంపిణీ చేయడం, బెడెన్ పావెల్ జీవిత చరిత్రపై పెయింటింగ్ పోటీలుజరుపుతాం. వారంలో ఒక పీరియడ్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు కేటాయించాలి.

– మడితాటి నరసింహారెడ్డి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి, ఉమ్మడి వైఎస్సార్ జిల్లా

గడువులోగా సమస్యల పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న జేసీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

రాయచోటి : జగనన్నకు చెబుదాం స్పందన ద్వారా అందిస్తున్న ప్రజల వినతులను సానుకూలంగా స్పందిస్తూ నిర్దేశిత గడువులోగా సమస్యలు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన దరఖాస్తులపై అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ఎన్నో ప్రయాసలకోర్చి తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా ప్రధాన కేంద్రాలకు వస్తుంటారన్నారు. అధికారులు ప్రజల సమస్యలు గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. కెఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ, డీఆర్‌ఓ సత్యనారాయణ, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ జయరాజ్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ ప్రజల నుంచి ఫిర్యాదులు అందుకున్నారు.

కొన్ని సమస్యలు:

- రాజంపేట మండలం రాంనగర్‌కు చెందిన కె.లావణ్య తమకు సదరం సర్టిఫికెట్ మంజూరు చేయించాలని జిల్లా జాయింట్ కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో అర్జీ సమర్పించారు.
- రాయచోటి మండలం అబ్బవరం గ్రామానికి చెందిన ఎస్.ఆనందయ్య తమ గ్రామంలో మురుగునీటి కాలువ ఏర్పాటు చేయాలని అర్జీ ద్వారా కోరారు.
- గాలివీడు మండలం గోరాన్‌చెరువుకు చెందిన వై.వెంకటరమణ తనకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయించాలని వినతిపత్రం అందజేశారు.
- ఇలా ఈ కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

సంకల్ప బలం..సంక్షేమ ఫలం





కడపలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, రాజంపేటలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, ఎమ్మెల్యే మేడా

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో సోమవారం సంబరాలు జరిగాయి. నాటి సంకల్ప బలం..నేడు ప్రతి ఇంటా సంక్షేమ ఫలాలు కురిపోస్తోందని ప్రజాప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.

- కడపలోని హెడ్‌పోస్టాఫీసు ఎదుట ఉన్న వైఎస్సార్ విగ్రహానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబులు గజమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి పాల్గొన్నారు.



రాయచోటి: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

- ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు.
- రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి రాజంపేటలోని తోట కళ్యాణ మండపంలో కేక్ కట్ చేశారు. రాయచోటి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు



రాయచోటిలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే , శాసనమండలి డిప్యూటీ చైర్మన్ తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 9, 10 తేదీల్లో జిల్లాలో పర్యటించే అవకాశం ఉందని, అయితే ఇంకా అధికారికంగా మినిట్ టు మినిట్ షెడ్యూల్ అందాల్సి ఉందని వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. ఇందుకు సంబంధించి పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సోమవారం తన చాంబర్‌లో ఎస్పీ సిద్ధార్థ కౌశల్, జేసీ గణేష్‌కుమార్, ఇతర అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 9, 10 తేదీల్లో పులివెందుల, ఇడుపులపాయలో ముఖ్యమంత్రి పర్యటించే అవకాశం ఉందన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా గట్టి ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్రొటోకాల్ ప్రకారం ఏర్పాట్లు చేయాలని, పోలీసు బందోబస్తు పటిష్టంగా ఉండాలన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

రాయచోటి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈనెల 9వ తేదిన రాయచోటికి రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్ పర్సన్ జకియా ఖానం పరిశీలించారు. సోమవారం రాయచోటిలోని చిత్తూరు, మదనపల్లి రింగ్ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, డీఎస్పీ మహబూబ్ బాషా, ఆర్ అండ్‌బీ, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలన చేశారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం కుమారుని వివాహ రిసెప్షన్‌కు సీఎం హాజరు కానున్నారు. ఈ సందర్భంగా పర్యటన ఏర్పాట్లను శ్రీకాంత్ రెడ్డి పర్యవేక్షిస్తున్నారు. రాజధాని కల్యాణ మండపం వెనుక భాగంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ నిర్మాణాల పనులను, హెలిప్యాడ్ నుంచి కల్యాణ మండపాలకు వెళ్లే రహదారుల మరమ్మతుల పనులపై ఆయన అధికారులతో చర్చించారు. అధికారులు సమన్వయంతో సీఎం పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి కోరారు.

ఇంటర్ విద్యార్థులకు తీపి కబురు

- ఫెయిలైనా తరగతులకు హాజరుకావచ్చు
- సప్లిమెంటరీ బదులు రెగ్యులర్



మదనపల్లె సిటీ : రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో పలు సంస్కరణలు తీసుకువస్తోంది. విద్యార్థులందరూ చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నది లక్ష్యంతో విద్యాశాఖ పని చేస్తోంది. విద్యార్థుల అభ్యున్నతి లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నూతన విధానాలు అమలు చేస్తున్నారు. తాజాగా మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఇంటర్మీడియట్‌లో ఫెయిలైన విద్యార్థులను రెగ్యులర్ విద్యార్థులుగా గుర్తించే విధానాన్ని అమలుకు శ్రీకారం చుట్టారు. ఇది ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు మంచి అవకాశం.

ఈ ఏడాది నుంచి నూతన విధానం

ప్రతి విద్యార్థికి ఇంటర్ చదువు ఒక మైలురాయి. ఇంటర్ పూర్తి చేస్తే ఉన్నత స్థితిలో స్థిరపడడానికి అనువైన విద్యను ఎంచుకునే అవకాశం ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యమున్న ఇంటర్‌లో సరిగా చదవలేకనో.. అనారోగ్య సమస్యల వల్లనో.. ఇంట్లో కారణాల వల్ల గానీ దాదాపు 30 నుంచి 40 శాతం సానుకూల ఫలితాలు సాధించలేకపోతున్నారు. అటువంటి వారి కోసం ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నా, వారిలో కొంత మంది తప్పి వచ్చే ఏడాది వరకూ వేచి చూడాల్సి వస్తోంది. అటు వంటి వారి కోసం ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి నూతన విధానాన్ని ప్రవేశపెట్టింది. దీని ప్రకారం ద్వితీయ సంవత్సరం పరీక్షలు తప్పిన విద్యార్థులు మరోసారి కళాశాలలో చేరవచ్చు. తరగతులకు హాజరుకావచ్చు. రెగ్యులర్ విద్యార్థులుగా మారిపోవచ్చు.

2021–22, 22–23 విద్యార్థులకు అవకాశం

నూతనంగా తీసుకొచ్చిన ఈ విధానంతో 2021-22 ,22-23 విద్యా సంవత్సరాల్లో ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ తప్పిన విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. ఉమ్మడి కడప జిల్లాలో 21–22లో 10,630, 22–23లో 6,826 మంది ప్రయోజనం పొందనున్నారు.

అమ్మ ఒడి పథకానికి అర్హత

నూతన విధానంలో రెగ్యులర్ విద్యార్థులుగా ఫీజులు చెల్లించి తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ప్రభుత్వం అమ్మ ఒడి పథకం లబ్ధిని అందిస్తోంది. అయితే వారు గతంలో కూడా అమ్మఒడి పథకాన్ని అందుకున్నవారై, ప్రస్తుత సంవత్సరంలో కూడా ఈ పథకానికి అర్హతలు కలిగి ఉండాలి.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం నూతనంగా ఈ ఏడాది నుంచే ఈ విద్యా విధానంలో ఫీజులు చెల్లించిన విద్యార్థులు రెగ్యులర్ విద్యార్థుల్లా తరగతులకు హాజరై పాఠాలను వినే అవకాశం కల్పించాం. అలా తరతులకు హాజరైతే మరో సారి ఆయా సబ్జెక్టులపై పట్టు పెరుగుతుంది. తద్వారా పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యే అవకాశాలు పెరుగుతాయి. గతంలో పరీక్షలు తప్పి సప్లిమెంటరీ రాసిన విద్యార్థులలకు పాస్ సర్టిఫికెట్‌లో సప్లిమెంటరీ విద్యార్థులుగా నమోదు చేసేవారు. నూతన విధానంలో అయితే ఎలాంటి విద్యార్థి ఉత్తీర్ణుడైనా అతనికి కూడా రెగ్యులర్ విద్యార్థిగానే పాస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు.

– బాలకృష్ణమూర్తి, బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్, మదనపల్లె

రైతన్నకు భరోసా!

- ఈ ఏడాది ఖరీఫ్‌తోపాటు ప్రస్తుత రబీలో రైతు భరోసా నిధుల విడుదల
- ఐదవ ఏడాది రెండత విడతగా రూ. 4000 అందించేందుకు ఏర్పాట్లు
- 205723 మంది రైతులకు రూ. 83.73 కోట్లు
- నేడు రైతుల ఖాతాలకు సొమ్ము జమ చేయనున్న సీఎం



సాక్షి రాయచోటి : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతన్నల పక్షపాతి అని మరోసారి రుజువైంది. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం జరిగితే ఆదుకుంటూ వస్తున్న రాష్ట్ర ప్రభుత్వం....పంట పెట్టుబడులకు సంబంధించి కూడా ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు రైతు భరోసా పథకం ద్వారా నిధులు విడుదల చేస్తోంది. వ్యవసాయంలో పంట పెట్టుబడులకు సంబంధించి రైతన్న ఎప్పుడూ ఇబ్బంది పడకూడదన్న సంకల్పంతో ప్రతి ఏడాది ఖరీఫ్‌లో పంట పెట్టుబడి కింద తొలి విడత సొమ్ములు అందించడం, తర్వాత నవంబరులో రెండవ విడత సొమ్ములను రైతుల ఖాతాలకు జమ చేస్తూ వస్తున్నారు. ప్రతి ఏడాది రూ. 13,500 చొప్పున రైతన్నకు ఐదేళ్లలో రూ. 67,500 వేలు అందిస్తోంది. ప్రస్తుతం ఐదవ ఏడాది రెండవ విడత కింద ప్రభుత్వం రైతు భరోసా ద్వారా రూ. 2000, పీఎం కిసాన్ ద్వారా రూ. 2000 కలుపుకుని రూ. 4000లను ముఖ్యమంత్రి రైతుల ఖాతాలకు జమ చేయనున్నారు.

రైతులకు భరోసా

రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు రైతులకు వెన్నుదన్నుగా నిలబడుతోంది. జిల్లాలో ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్న మూడు నెలల్లోనే పరిహారాన్ని అందించింది. అంతేకాకుండా ఖరీఫ్ పంటల బీమాకు సంబంధించి సీజన్ ముగియగానే ఈ–క్రాప్ ఆధారంగా ప్రతి యేడాది బీమా సొమ్ములు వెంటనే అందిస్తూ ప్రత్యేక ముద్ర కనిపిస్తోంది.

2,05,723 మంది రైతులకు రూ. 83.73 కోట్లు

అన్నమయ్య జిల్లాలో రైతులకు సంబంధించి మంగళవారం రైతు భరోసా–పీఎం కిసాన్ పథకానికి సంబంధించి ఐదవ ఏడాది రెండవ విడత నిధులు రైతుల ఖాతాలకు జమ కానున్నాయి. అందుకు సంబంధించి 2,05,723 మంది రైతులకుగాను రూ. 83.73 కోట్ల నిధులు అందనున్నాయి. జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున రైతులకు ప్రయోజనం ఒనగూరనుంది. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె పట్టణం జేసీఎం కమ్యూనిటీ హాలులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి రైతులకు అధికారుల ద్వారా నిధులు విడుదల చేయనున్నారు.

గత ఐదేళ్లుగా రైతు భరోసాకు సంబంధించి వివరాలు

సంవత్సరం	రైతులు	మొత్తం (రూ. కోట్లలో)
2019–20	1,98,748	202.46
2020–21	2,08,836	210.92
2021–22	2,10,810	215.67
2022–23	2,01,829	268.62
2023–24	2,02,094	151.95

ఐదవ ఏడాది రెండవ విడతకు సంబంధించిన నిధుల వివరాలు

నియోజకవర్గం	లబ్ధిదారుల సంఖ్య	ఆర్థికసాయం (రూ. కోట్లలో)
రాయచోటి	40460	16.53
రాజంపేట	23568	9.60
రైల్వేకోడూరు	27666	11.18
మదనపల్లె	22735	9.18
పీలేరు	42548	17.44
తంబళ్లపల్లె	48746	19.80

అన్నదాతలకు అండగా ప్రభుత్వం



రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ సొమ్ములను విడుదల చేయనుంది. ఈ మేరకు రెవెన్యూ,వ్యవసాయశాఖల సహకారంతో అర్హులైన రైతులను గుర్తించాం. ప్రస్తుత ఈ సీజన్‌లో రైతులకు సాయం అండగా నిలబడనుంది. జిల్లాలో రెండు లక్షల మంది పైచిలుకు రైతులకు ప్రభుత్వం నుంచి భరోసా నిధులు అందనున్నాయి. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో నిధులు విడుదల చేయగానే ఇక్కడి రైతుల ఖాతాలకు సొమ్ములు జమ అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– పీఎస్ గిరీషా, జిల్లా కలెక్టర్, అన్నమయ్య జిల్లా

క్లుప్తంగా

రాజుపాలెం వద్ద ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చాపాడు : మండల పరిధిలోని రాజుపాళెం గ్రామ సమీపంలోని పెన్నానది వద్ద నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు. మండలంలోని బద్రిపల్లె గ్రామానికి చెందిన శంఖు వీరయ్య అనే వ్యక్తికి చెందిన ట్రాక్టర్‌లో పెన్నానది నుంచి ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నండటంతో కేసు నమోదు చేసి మండల తహసీల్దార్‌కు ట్రాక్టర్‌ను అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోరుమామిళ్లలో క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

పోరుమామిళ్ల : పట్టణంలోని ముస్లిం వీధిలో ఆదివారం రాత్రి ఇండియా – దక్షిణాఫ్రికా క్రికెట్ ఆటపై బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందటంతో దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ బెట్టింగ్ నిర్వహిస్తున్న వారి నుంచి రూ. 41,500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. బెట్టింగులో ఉన్నవారంతా చదువుకున్నవారేనన్నారు. వారిలో ఉన్నత విద్య చదివిన వారు కూడా ఉన్నారని తెలిపారు. పిలిచినప్పుడు కోర్టులో హాజరు కావాలని చెప్పి స్టేషన్ బెయిల్ ఇచ్చామన్నారు.

గురుకుల పాఠశాలలో మేడపై నుంచి దూకిన విద్యార్థిని

- పరిస్థితి విషమం
- కడప రిమ్స్‌కు తరలింపు


రెడ్డెమ్మ (ఫైల్)


తీవ్రంగా గాయపడిన విద్యార్థిని రెడ్డెమ్మ

నందలూరు (రాజంపేట): మండలంలోని ఆడపూరు బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న రెడ్డమ్మ అనే విద్యార్థిని మేడపై నుంచి దూకడంతో తీవ్ర గాయాలపాలైన సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. వేంపల్లి మండలం రాజుపాలెంకు చెందిన ఎం.రెడ్డెమ్మ (16)కు తల్లిదండ్రులు ఇద్దరు మృతి చెందారు. దీంతో ఆ విద్యార్థిని బంధువులు అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చేర్పించారు. మనస్థాపం చెందో లేక ఏ ఇతర కారణాలో తెలియదుగానీ సోమవారం సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో తోటి విద్యార్థినులు వద్దన్నా వినకుండా హాస్టల్ రెండవ అంతస్తు పైనుంచి దూకడంతో తీవ్రంగా గాయపడింది. తోటి విద్యార్థులు ఉపాధ్యాయులకు సమాచారం అందించడంతో 108 ద్వారా రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి ఆర్డీఓ రామకృష్ణారెడ్డి చేరుకొని విద్యార్థిని ఆరోగ్యంపై ఆరాతీశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ అబ్దుల్ జహీర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి విద్యార్థులతో విచారణ చేపట్టారు.

డ్రోన్ వినియోగంతో ఎన్నో లాభాలు


ప్రయోగాత్మకంగా వరి పంటపై డ్రోన్‌ను ఎగురవేసిన వ్యవసాయశాఖ అధికారులు

రాయచోటిటౌన్ : డ్రోన్లను వినియోగించడం వలన రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయని రాయచోటి వ్యవసాయశాఖ ఏడీ శ్రీలత పేర్కొన్నారు. సోమవారం రాయచోటి మండలం యండపల్లె రైతు భరోసా కేంద్ర పరిధిలోని పంట చేలలో డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ డ్రోన్ అనే పరికరం ఒక వైమానిక వాహనం లాంటిదన్నారు. ఇది పంట ఉత్పత్తిని పెంచడంతో పాటు పంటను పర్యవేక్షిస్తుందని తెలిపారు. దీంతో తమ పంట పొలంలో చీడ పీడలను గుర్తించి ఎప్పటికప్పుడు కావాల్సిన జాగ్రత్తలు పాటించడానికి వీలు అవుతుందని చెప్పారు. అందుకే ప్రభుత్వం వ్యవసాయంలో కొత్త మార్గదర్శకాలు విడుదల చేసిందని వివరించారు. డ్రోన్‌ల ద్వారా పురుగు మందులు, ఎరువులు పిచికారీ చేయడం వలన సమయం ఆదా కావడంతో పాటు ఖర్చు కూడా తగ్గుతుందని వివరించారు. అలాగే సాధారణ పరిస్థితిలో పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో విషప్రభావానికి గురై తద్వారా గుండె సంబంధిత జబ్బులకు గురి అవుతుంటారని తెలిపారు. డ్రోన్ ద్వారా పిచికారీ చేయడం వలన విష ప్రభావం ఉండదని చెప్పారు. డ్రోన్లను బీఎస్సీ అగ్రికల్చర్, డిప్లొమా చదివిన వారికి 50 శాతం సబ్సిడీతో అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓలు దివాకర్, గీత, కిశోర్, బాషా, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగు పడి వ్యక్తికి తీవ్ర గాయాలు


పిడుగుపాటుకు గురైన మహమ్మద్ ఆబిద్

వాల్మీకిపురం : పిడుగుపాటుకు ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గుర్రంకొండ మండలం మర్రిపాడులో చోటు చేసుకొంది. వివరాలు.. సోమవారం మర్రిపాడుకు చెందిన నవాజ్ కుమారుడు మహమ్మద్ ఆబిద్ ఆవులు మేపుకుంటున్నాడు. అదే సమయంలో పిడుగు పడడంతో మహమ్మద్ ఆబిద్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లికి సిఫార్సు చేశారు.

భూ యాజమాన్య హక్కుల కల్పనకే స్వమిత్వ సర్వే

రాయచోటి : జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో నివాస ప్రాంతాలైన గ్రామకంఠం స్థలాలలో ప్రత్యేకంగా డ్రోన్ ద్వారా సర్వే చేయించి ఇళ్లు, స్థలాలకు యాజమాన్య హక్కులు కల్పించడమే భూ సర్వే, భూ హక్కు ముఖ్య ఉద్దేశమని పంచాయతీ అధికారి ధనలక్ష్మీ తెలిపారు. సోమవారం ఆమె ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామకంఠంపై ఇప్పటి వరకు కచ్చితమైన హక్కులు లేనందు వలన ప్రజలకు ఆ ఆస్తులపై ఎలాంటి లావాదేవీలు నిర్వహించే అవకాశం లేకుండా పోయిందన్నారు. అన్నమయ్య జిల్లాలో 2020 అక్టోబర్ 11న గ్రామాలలోని ఇళ్ల స్థలాలకు యాజమాన్య హక్కులను ఖరారు చేస్తూ రూపొందించిన కార్డులను పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన స్వమిత్వ (సర్వే ఆఫ్ విలేజ్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్) కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ప్రభుత్వం వీటిని పరిష్కరించే దిశగా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం స్వమిత్వ సర్వే అమల్లోకి తెచ్చి గ్రామాల్లోని ఆస్తులను అధునాతన సాంకేతిక పద్ధతులలో సర్వే చేయించి ఆస్తి హక్కు పత్రాలను అందజేస్తుందన్నారు. ఈ హక్కు పత్రాల ద్వారా ప్రజలు తమ ఆస్తులను పునర్నిర్మాణం చేసుకోవడం, బ్యాంకుల్లో తనఖా ఉంచి రుణాలు పొందడం, విద్యార్థుల రుణాలకు హామీగా ఉంచడం, ఇతరులకు విక్రయించడం, వారసులకు, బంధువులకు దాన విక్రయ సర్వాధికారులు బదిలీ చేసుకోవడం, న్యాయపరమైన చిక్కులు లేకుండా హక్కులను దాఖలు పర్చడం వంటి లాభాలను పొందవచ్చన్నారు. అన్నమయ్య జిల్లాలో 501 గ్రామ పంచాయతీ, 470 రెవెన్యూ గ్రామాలకుగాను రీ సర్వే స్వామిత్వ పథకం ఇప్పటికే 136 గ్రామాలలో గ్రౌండ్ ట్రూతింగ్ సర్వే పూర్తి చేశామన్నారు. అలాగే జిల్లాలోని 58 గ్రామాలకు గాను గ్రౌండ్ వ్యాలిడేషన్ పూర్తి చేసి యాజమాన్య హక్కు కల్పించే నిమిత్తం ప్రాపర్టీ కార్డ్స్ (ప్రాపర్టీ పార్సెల్ మ్యాప్)లు తయారు చేసి పంపిణీ చేసేందుకు సిద్ధం చేశామని తెలిపారు. స్వామిత్వ సర్వే జరిగే సమయంలో 9(2) నోటీసులను ప్రజలు అందుకుని అందుబాటులో ఉండి రీ సర్వే కార్యక్రమానికి సహకరించాలని డీపీఓ ఆ ప్రకటనలో కోరారు.

ద్విచక్ర వాహన దొంగల అరెస్ట్

- రూ.13.70 లక్షలు విలువ చేసే 14 బైక్‌లు స్వాధీనం, ముగ్గురి అరెస్ట్
- ప్రధాన నిందితుడు అన్నమయ్య జిల్లా వాసి

అనంతపురం క్రైం: జల్సాల కోసం చోరీలను మార్గంగా ఎంచుకున్న ద్విచక్ర వాహనాల దొంగలను అనంతపురం వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్పీ అన్బురాజన్ వెల్లడించారు. అన్నమయ్య జిల్లా ఇందిరానగర్‌కు చెందిన కుందాని దిన ప్రకాష్, నార్పలలోని కొత్తబస్టాండ్ ప్రాంతానికి చెందిన ఆవుల సిద్దార్థ స్నేహితులు. వీరిలో ప్రకాష్ కీలక నిందితుడు. గతంలో తిరుపతిలో ద్విచక్ర వాహనాలు అపహరించిన కేసులో జైలు శిక్ష అనుభవించి బయటకు వచ్చాడు. కూలి పనులతో వచ్చే ఆదాయం జల్సాలకు సరిపోక వాహనాలను అపహరించుకెళ్లడం అలవాటుగా మార్చుకున్నాడు. జేసీబీ వాహనానికి సహాయకుడిగా వెళ్లే సిద్దార్థను కలుపుకుని నకిలీ తాళాలతో అనంతపురం, నార్పల, పుట్లూరు, బుక్కరాయసముద్రంలో దుకాణాల ఎదుట నిలిపిన ద్విచక్రవాహనాలను అపహరించుకెళ్లి ఓ చోట డంప్ చేసేవారు. వీటిని అనంతపురంలోని భైరవనగర్‌కు చెందిన కారు డ్రైవర్ సంపతి విజయ్ సాయంతో విక్రయించి, వచ్చిన సొమ్ముతో ముగ్గురూ జల్సాలు చేసేవారు. ఇటీవల జిల్లాలో జరిగిన ద్విచక్ర వాహనాల దొంగతనాలను ఎస్పీ అన్బురాజన్ తీవ్రంగా పరిగణించడంతో దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో సోమవారం ఉదయం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న గోశాల వద్ద ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.13.70 లక్షలు విలువ చేసే 14 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన డీఎస్పీ ప్రసాదరెడ్డి, అనంతపురం వన్‌టౌన్ సిఐ.రెడ్డెప్ప, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బందిని ఎస్పీ అభినందిస్తూ రివార్డులు ప్రకటించారు.

హుండీ దొంగలకు జరిమానా, జైలు శిక్ష


నిందితుడు చిన్న

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరమ్మ ఆలయంలో జరిగిన హుండీ దొంగతనం కేసుకు సంబంధించి నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు సోమవారం తెలిపారు. క్రైం నంబర్ 28/2023యు, సెక్షన్ 457, 380 ఐపీసీ కేసులలో నిందితుడు కొండూరు చిన్న నలుగురితో కలిసి మల్లూరమ్మ ఆలయంలో దొంగతనం చేశాడన్నారు. అదే రోజు ఆలయ ఈఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసి రాయచోటి ఏజేఎఫ్ సీఎం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశామన్నారు. జడ్జి శారద విచారించి నిందితులకు 4 నెలలు సాధారణ జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధించారని ఎస్‌ఐ తెలిపారు.

మరింత సుందరంగా శిల్పారామాలు


శిల్పారామాన్ని పరిశీలిస్తున్న శిల్పారామాల రాష్ట్ర సీఈఓ శ్యాం సుందర్‌రెడ్డి

కడప కల్చరల్ : రాష్ట్రంలోని శిల్పారామాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు కృషి చేస్తున్నామని శిల్పారామాల రాష్ట్ర సీఈఓ డి.శ్యాం సుందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన కడప శిల్పారామాన్ని పరిశీలించారు. రాష్ట్ర శిల్పారామాల పాలనాధికారి మునిరాజుతో కలిసి ఆయన అక్కడి అన్ని విభాగాలను చూసి పలుసూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇటీవల శిల్పారామంలో ఏర్పాటు చేసిన బోరును ప్రారంభించి వస్తున్న నీటిని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. శిల్పారామాల అభివృద్ధిలో భాగంగా కడపలో రెండు గజిబొజిలను ఏర్పాటు చేస్తున్నామని, అందులో ఒకటి ఇప్పటికే పూర్తయిందని, రెండవ దాన్ని కూడా త్వరలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. శిల్పారామం ప్రారంభంలో ఉన్న గేమ్స్ జోన్‌లోని అన్ని విభాగాలను పడమరవైపు చివరికి మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆ ప్రాంతమంతా పచ్చికను ఏర్పాటు చేసి సందర్శకులకు ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు. శిల్పారామం మొత్తం సరికొత్త విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి రాత్రి పూట ఆకర్షణీయంగా కనిపించేందుకు కృషి చేయాలన్నారు. అక్కడి స్టాల్స్‌లో ని అన్నింటికీ రక్షణ కోసం సెక్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలోని మిగతా శిల్పారామాలలో కూడా అభివృద్ధి పనులు చేపట్టామని, పులివెందుల శిల్పారామాన్ని ఆధునీకరించామని, ఈనెల 9న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లా రాయచోటిలోని కడప రోడ్డులో కలెక్టరేట్ సమీపంలో శిల్పారామం ఏర్పాటుకు పనులు ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో శిల్పారామాల విజయవాడ ఏఓ ఎ.శ్రీరాములు, అనంతపురం ఏఓ కృష్ణప్రసాద్, సూపర్‌వైజర్లు, సీనియర్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు

మదనపల్లె : ఆటో అదుపుతప్పి వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. పట్టణంలోని కురవంకలో నివాసం ఉంటున్న శ్రీనివాసులు(45) సొంత ఆటోలో వాల్మీకిపురానికి వెళ్లి తిరిగి వస్తుండగా, సీటీఎం సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. శ్రీనివాసులు గాయపడగా 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చెట్టును ఢీ కొన్న కారు



పుల్లంపేట : పుల్లంపేట మండల పరిధిలోని సీతారాంపేట వద్ద సోమవారం తెల్లవారుజామున కారు అదుపు తప్పి చెట్టును ఢీ కొంది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న బాలుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాలకు చెందిన వారు తిరుమలకు బయల్దేరి స్వామి వారి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. సీతారాంపేట సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి చెట్టును ఢీ కొంది. దీంతో కారులో ఉన్న నిశాంత్ (8) అనే బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైకు ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని పరిశీలిస్తున్న కడప డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎన్.కొండయ్య

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని బండపల్లె పంచాయితీ ఐరిస్ హోటల్ సమీపంలో సోమవారం రాత్రి బైకు ఢీ కొనడంతో గుర్తు తెలియని వృద్ధునికి తీవ్ర గాయాలైనట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. ఈ ప్రమాదంలో వృద్ధునికి తీవ్ర గాయాలు కావడంతో అదే మార్గంలో వెళ్తున్న కడప డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎన్.కొండయ్య ప్రమాద సంఘటన స్థలంలో కారు ఆపి వెంటనే 108కు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం వృద్ధుడిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మోటార్ల దొంగ అరెస్టు

ఆరు మోటార్లు స్వాధీనం


పోలీసుల అదుపులో నిందితుడు

నందలూరు (రాజంపేట) : మండల పరిధిలో నిర్మాణంలో ఉన్న గృహాలు, ఇళ్లవద్ద ఉన్న వాటర్ మోటార్లను చోరీ చేసిన వ్యక్తిని అరెస్టు చేసి, అతని నుంచి ఆరు మోటార్లను స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ తమకు వచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ అబ్దుల్ జహీర్ తన సిబ్బందితో మండల పరిసర ప్రాంతాలలో తనిఖీలు నిర్వహిస్తుండగా సోమవారం ఉదయం 10 గంటలకు ఆల్విన్ ఫ్యాక్టరీ సమీపంలోని బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న షేక్ మస్తాన్‌ను అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి ఆరు మోటార్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మోటారు దొంగతనాలకు పాల్పడిన షేక్ మస్తాన్ గతంలో రాయచోటి టౌన్ పరిధిలోని కొత్తపల్లిలో నివాసం ఉండేవాడని, ప్రస్తుతం రాజంపేట మండల పరిధిలోని బోయనపల్లి గ్రామంలో నివాసం ఉంటున్నాడని తెలిపారు. అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న మోటార్ల విలువ సుమారు రూ. 75 వేలు వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐలు శంకర్ నాయక్, రాముడు, పోలీస్ సిబ్బంది మహేంద్ర వర్మ, దర్బార్ బాషా, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ విజేతలు వైఎస్సార్, శ్రీకాకుళం జట్లు


బాలుర విజేత వైఎస్సార్ జట్టు


బాలికల రన్నరప్ వైఎస్సార్ జట్టు

ఒంగోలు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 అంతర్ జిల్లాల సాఫ్ట్ బాల్ పోటీల్లో విజేతగా బాలుర విభాగంలో వైఎస్సార్‌జిల్లా జట్టు, బాలికల విభాగంలో విజయనగరం జట్టు జయకేతనం ఎగురవేశాయి. 67వ అంతర్ జిల్లాల సాఫ్ట్ బాల్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు మాట్లాడుతూ.. క్రీడాకారులు తమకు అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకుంటూ ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. క్రీడలతోపాటు చదువుపైనా దృష్టి సారిస్తే జీవితంలో విజయం సొంతమవుతుందని పేర్కొన్నారు. చెడు వ్యసనాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎస్‌జీఎఫ్ క్రీడల రాష్ట్ర పరిశీలకుడు జగదీశ్వర రెడ్డి మాట్లాడుతూ.. పోటీలకు ప్రకాశం జిల్లా ఆతిథ్యం బాగుందని కితాబిచ్చారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ మాట్లాడుతూ.. ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లకు తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ఆకర్షణీయమైన క్రీడా దుస్తులు, ట్రోఫీలు అందించిందని, తద్వారా క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యమేంటో స్పష్టమైందన్నారు. సాఫ్ట్‌బాల్ అంతర్‌జిల్లాల నిర్వాహక కార్యదర్శి శివశంకరరావు మాట్లాడుతూ.. క్రీడాకారులు, కోచ్‌లకు భోజన సదుపాయం కల్పించేందుకు విద్యాశాఖ రూ.3 లక్షలు వెచ్చించడం అభినందనీయమంటూ డీఈఓ వీఎస్ సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలిపారు. పీఈటీల సంఘం కార్యదర్శులు నత్తల కృష్ణ, వై.శీనయ్య, పలువురు పీఈటీలు, పీడీలు పాల్గొని పోటీలను పర్యవేక్షించారు.

పోటీల విజేతలు వీరే..

బాలుర విభాగం : వైఎస్సార్(ప్రథమ స్థానం), శ్రీకాకుళం(ద్వితీయ), విజయనగరం(తృతీయ)

బాలికల విభాగం : విజయనగరం(ప్రథమస్థానం), వైఎస్సార్(ద్వితీయ స్థానం), ప్రకాశం(తృతీయ)

అండర్ 17 ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్లు ఇవే

అండర్-17 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సాఫ్ట్‌బాల్ రాష్ట్ర జట్లను ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ సాఫ్ట్ బాల్ అంతర్ జిల్లాల పోటీల పరిశీలకుడు జగదీశ్వరరెడ్డి ప్రకటించారు. ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. పరిశీకులు జగదీశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు సీహెచ్ సత్యన్నారాయణ (విజయనగరం), కె.గోపాల్‌రెడ్డి (అనంతపురం), కృష్ణకుమార్(కృష్ణాజిల్లా) ఈ రాష్ట్ర జట్లను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన జట్లు త్వరలో జరిగే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ సాఫ్ట్ బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తాయి.

బాలుర రాష్ట్ర జట్టు : వై.లక్ష్మీ ప్రసన్న, ఎం.యశ్వంత్ (శ్రీకాకుళం), కె.ఆంజనేయులు (వైఎస్సార్ కడప), ఎస్.మధుసూదనరావు (శ్రీకాకుళం), పి.జనార్దన్‌రావు (విజయనగరం), ఎం.మనోజ్ (వైఎస్సార్ కడప), డి.రాఘవ (విజయనగరం), పి.మహీధర్ (వైఎస్సార్ కడప), బి.నారాయణస్వామి (అనంతపురం), బి.మహేష్ (పశ్చిమ గోదావరి), ఎం.ఆకాష్ (గుంటూరు), పి.యశ్వంత్(పశ్చిమగోదావరి), టి.నాగేంద్ర (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా), పి.హరీష్‌సాయి (ప్రకాశం), బి.లక్ష్మణ్ స్వామి(విశాఖపట్నం), సీహెచ్ పీటర్ (ప్రకాశం), స్టాండ్‌బైలుగా ఎ.కార్తీక్ (గుంటూరు), కె.శశి (అనంతపురం), కె.హేమంత్ కుమార్ (కృష్ణా), డి.నవీన్ (వైఎస్సార్ కడప), కె.రోహిత్ (విజయనగరం).

బాలికల జట్టు : టి.ప్రశాంతి (విజయనగరం), ఎం.వీరనారాణమ్మ (వైఎస్సార్ కడప), సీహెచ్ అనిత (గుంటూరు), బి.సుప్రియ (విజయనగ రం), ఎస్.సల్మ (ప్రకాశం), ఎం.శివ నాగ లక్ష్మి (ప్రకాశం), పి.హైమావతి (విజయనగరం), ఎన్.బేబి (ప్రకాశం), జి.సునందిని(గుంటూరు), బి.నవ్యశ్రీ (కర్నూలు), కె.రాజేశ్వరి (అనంతపురం), జె.సంజన చౌదరి (ప్రకాశం), వి.యవంతిక(ప్రకాశం), కె.రిషిత (కృష్ణా), పి.రేణుక (శ్రీకాకుళం), ఎన్.భువనేశ్వరి (తూర్పు గోదావరి), స్టాండ్‌బైలుగా టి.కీర్తన (ప్రకాశం), పి.చైతన్య కుమారి (విజయనగరం), కె.రోజా (గుంటూరు), జి.సీల (విశాఖపట్నం), టి.సుకన్య (అనంతపురం).

కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటిటౌన్ : కాంట్రాక్టు పద్ధతిలో పని చేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని అన్నమయ్య జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులు హెచ్‌టీటీపీఎస్://అన్నమయ్య.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులు ఈ నెల 20వ తేదీసాయంత్రం 5 గంటల లోపు తమ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

చింతకొమ్మదిన్నె : మండలంలోని ప్రొఫెసర్స్ కాలనీలో గల చౌడమ్మ ఆలయంలో 2021లో జరిగిన చోరీ కేసులో ముద్దాయిలుగా ఉన్న కమలాపురం మాధవ, దొండపాటి ప్రతాప్‌లకు సోమవారం కడప ఎక్సైజ్ కోర్టు జైలు శిక్ష విధించినట్లు సీకే దిన్నె ఎస్‌ఐ బి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. జిల్లా జడ్జి హేమ శ్రవంతి జానకిరామ్ వాదనలు విన్న తర్వాత నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు 248(2) సీఆర్‌పీసీ ప్రకారం 2 సంవత్సరాలు జైలు శిక్షతో పాటు, రూ.10వేలు జరిమానా విధించారన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణాలపై నిరంతర నిఘా


ప్రభుత్వ మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోపాల్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో 124 ప్రభుత్వ మద్యం దుకాణాలపై నిరంతరం నిఘా ఉంటుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోపాల్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలోని పలు షాపులను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం దుకాణాల్లో ప్రభుత్వం సూచించిన ధరలకు మద్యం అమ్ముతున్నారని, ఎక్కడా కూడా ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు అమ్మడం లేదన్నారు. ఇప్పటికే జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను నంద్యాల జిల్లా నుంచి వచ్చిన విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారన్నారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ రేట్లకు అమ్ముతున్న సిబ్బందిపై కేసులు నమోదు చేశామన్నారు.